# ఏది సత్యం? ఏదసత్యం?

గంటి భానుమతి

నెలరోజుల కింద వెళ్ళిన రంగారావు, ఇంటి కెళ్తే, తాళం దర్శనం ఇచ్చింది. అన్నయ్య ఇంటికి వెళ్ళి ఉంటుందని వెళ్ళాడు. అక్కడ భార్య మైత్రేయి కనపడింది.

తల్లి వర్దనమ్మ, భార్య మైత్రేయి చూసిన చూపులకి శక్తే గనక ఉంటే, అక్కడే బూడిదయిపోయేవాడు.

రంగారావెక్కడికి వెళ్ళాడో మైత్రేయివలన తెలిసింది కాబట్టి రంగారావు అన్నగారు నేరుగా అడిగాడు.

''ఉద్యోగం మానేసి, సన్యాసుల్లో కలుస్తానని వెళ్ళావుట...''

తల్లి ఇచ్చిన కాఫీ గొంతు దగ్గర ఆగిపోయింది.

గుమ్మం దగ్గరున్న భార్యని కను చివర్లనుంచి చూశాడు. ఆమె మొహం తిప్పింది.

''ఏం ఇంట్లో పెళ్ళాం, సంసారం, పనికిరాలేదా? ఇంట్లో తిండి వంట పట్టడంలేదా! అయినా మైత్రేయి ఏం తక్కువ చేసిందని, దాన్నలా వదిలేసి వెళ్ళిపోదా మనుకుంటున్నావ్?''

రంగారావేం మాట్లాడకుండా కాఫీగ్లాసుని గోడ వారగా ఉంచి లేచాడు.

''ఆగు... మాట్లాడు... సరే సన్యాసం తీసుకుంటానని, అదేదో ఆశ్రమంలోనే ఉంటావని అంటున్నావట. బావుంది. అక్కడ ఏం తింటావ్? కడుపునైతే మాడ్చుకోవు కదా! అక్కడ వాళ్ళెవరో పెట్టేది తింటావ్! వాళ్ళిచ్చే దానాల్తో, వీళ్ళిచ్చే దానాల్తో, కాందిశీకుల్లా, వరసగా నుంచుని, వాళ్ళిచ్చేది తింటావా! ఆ నాలుగు మెతుకులు ఎవరో దయగల దాతలు ఇచ్చిందే కదా!

సరే... కడుపు ఆకలిని ఆ నాలుగు మెతుకుల్తో తీర్చుకుంటావ్. మరి శరీరానికి కలిగే ఆకలి... దాన్ని జయించావా! జయించగలవా! లేదు కదా... ఆ ఆకలి తీరాలంటూ ఎవరో ఒకర్ని పట్టుకోవు కదా! అలాచేస్తే అది సన్యాసం ఎందుకవుతుంది? వ్యభిచారం అవుతుంది. అంతకన్నా నీచం లేదు.

ప్రకృతి, దేవుడు, కొన్ని సహజమైన గుణాల్ని మనుషులందరికీ ఇచ్చారు. వాటిని ఎదిరించడం, ధిక్కరించడం అంత తేలిక కాదు. ఇప్పుడు నీది కడుపు నిండిన బేరం కాబట్టి నీకేం తెలీదు. ముందు ముందు నీ ఆకలి తీరడం కోసం ఎంత నీచానికైనా దిగజారుతావు...''

విననట్లుగా కదిలాడు రంగారావు.

''నువ్వెళ్ళిపోతే, మైత్రేయి సంగతేవిటీ?''

మైత్రేయి భర్తవైపు ఆతృతగా చూస్తోంది, ఏం చెప్తాడా అని.

''పుట్టింటికెళ్దామని అనుకుంటోంది...''

వర్దనమ్మ ఆశ్చర్యంగా కొడుకుని చూసింది.

''ఆమె అనుకోడం ఏవిటి? ఆమెకేం దారి చూపక్కర్లేదా! అలా దాన్ని వదిలేస్తావా! నిన్ను నమ్మింది. పెళ్ళి చేసుకుంది. దాన్నలా వొదిలేస్తే అదేం చేస్తుంది? పుట్టింటికే వెళ్తుంది. ఇంకెక్కడుంటుంది? ఇందులో ఆమె అనుకోడం అనుకోకపోవడం అన్నదేలేదు. మరి ఆమె కడుపులో ఉన్న బిడ్డ... ఆ సంగతేం చేశావ్?'' తీవ్రంగా ప్రశ్నించింది.

''అది మైత్రేయి చూసుకుంటుంది... అది నాకనవసరం...''

''అవునురా... అది నీకనవసరం... మైత్రేయి చూసుకుంటుంది. అది అమ్మకదా... చూసుకోక ఏం చేస్తుంది? అది చూడలేదనుకో, దాని పుట్టింటివాళ్ళు

చూస్తారు. వాళ్ళు కూడా చూడలేకపోతే, మేము, మేము కూడా చూడలేకపోతే, మన ఊళ్ళో విశాలంగా రోడ్లున్నాయి. రోడ్లవారగా చెత్తకుండీలు కూడా ఉన్నాయి. ఏదో ఏరుకుని తింటూ ఎలాగో పెద్దవాడయిపోతాడు. వాడు ఎక్కడో, ఎప్పుడో నీకు కనిపిస్తాడు. అప్పుడు నీ గురించి నీ జీవితం గురించి చెప్పు. అన్నీ వింటాడు.

జన్మనిచ్చినవాడు, సమాజానికెంత సేవ చేశాడో, ఎంత ఉపయోగపడ్డాడో, ఎంత గుర్తింపు పొందాడో... చెప్పు... ఈ సన్యాసం వల్ల, జపతపాలవల్ల, ఈ సంసార మోహం నుంచి బయటపడ్డాడా! ఉపవాసాలు చేస్తూ ఆకలి దప్పుల్ని జయించాడా! చెప్పు.

అప్పుడు వాడు నవ్వుతాడు. ఎందుకో తెలుసా! కట్టుకున్న భార్యని, లోకం చూడని కొడుకుని, వయసు మీరిన తల్లిని, కుటుంబాన్ని పట్టించుకోని మనిషి, తెలీని మనుషులున్న సమాజాన్ని ఏం పట్టించుకుంటాడు!''

రంగారావు గదిలోకి వెళ్ళిపోయాడు. మైత్రేయి అడ్డుకుంది. అడ్డులెమ్మన్నట్లుగా తలతిప్పాడు.

''మమ్మల్ని అర్ధాంతరంగా వదిలేస్తే ఎలా! మన జీవితాలు చాలా చిన్నవి. రేపేమవుతుందో మీరు చెప్పగలరా! ఆ రేపు కూడా ఎంతో దూరం లేదు. ముంచుకొచ్చేస్తోంది. ఆ రేపే మన భవిష్యత్తు. మనం ఈ వర్తమానానికి న్యాయం చెయ్యకపోతే, భవిష్యత్తు క్షమిస్తుందా!''

వర్ధనమ్మ గబగబా వచ్చింది.

''ఒరేయ్... ఇలా మమ్మల్ని వొదిలేసి వెళ్ళిపోతున్నావ్... రేపు నీకు వయసు పైబడితే... అప్పుడు... అప్పుడేం చేస్తావ్?''

రంగారావు తల్లివైపు తిరిగాడు.

''ఏం మాట్లాడుతున్నావమ్మా... ఎన్నో వృద్ధాశ్రమాలున్నాయి. అన్నీ ఎందుకున్నాయి? వృద్ధులు, ఇళ్ళల్లోంచి తరమబడ్డ వాళ్ళకోసమే కదా! గాజుకళ్ళతో మృత్యువుని ఆహ్వానిస్తున్నవాళ్ళున్నారు. ఆశ్రమాలు అక్కరకొస్తాయిలే... వయసు పైబడ్డవాళ్ళకి...''

''అవునురా... చక్కటి నిజం చెప్పావు. కానీ, ఆలోచించు.అన్ని వృద్ధాశ్రమాలు ఎందుకున్నాయి? నీలాంటి కొడుకుల మూలంగానే ఉన్నాయి. నువ్వు ఇప్పుడే మమ్మల్ని వొదిలేస్తున్నావ్, అలాంటి నువ్వు కొడుకుల గురించి చెప్పడమా... పోనీ... నువ్వేమయినా, నీ సంతానికి ఉదాహరణగా ఉన్నావా! లేదు కదా, నువ్వు సంతానం గురించి, కొడుకుల గురించి చెప్పడమా!

నిజమేరా... ఇన్ని ఆశ్రమాలున్నాయి. అందులో కొడుకులు తరిమేసిన వృద్ధులున్నారు. కానీ, వాళ్ళల్లో సంతోషం ఉంది.

తల్లిదండ్రులుగా పిల్లల్ని పెంచాం, చదివించాం. కర్తవ్యాన్ని నిర్వర్తించాం అని అనుకుంటారు. కానీ... నువ్వు... ఏంచేశావ్? ఓ మంచి తండ్రివి కాలేకపోతున్నావ్!

అలాంటివాడివి ఆశ్రమంలో ఏంచేస్తావ్? ఈ సమాజాన్ని ఉద్ధరించేద్దామనే! నువ్వేం చెయ్యగలవ్! ఈ సమాజం యుగాల నుంచి అలాగే ఉంది. ఏం మారలేదు.

అయినా మారాల్సింది సమాజం కాదు మనుషులు. ఎవరి విధులు, బాధ్యతలు, కర్తవ్యాలు, ధర్మాలు వారు నిర్వర్తిస్తే, ఈ సమాజం దానంతట అదే మారుతుంది...''

రంగారావు గదిలోంచి బయటికెళ్ళబోయాడు.

''ఆగండి. మీ అమ్మ ప్రశ్నలకి సమాధానాలు చెప్పండి. ఇప్పుడు చెప్పకపోయినా, రేపు ఇదే ప్రశ్నలు మళ్ళీ మా ఎదురుగా వస్తాయి. అప్పుడేం చెప్తారు?''

సమాధానం లేదు.

''సరే... బంధం తెంచుకోవాలనుకుంటున్నది మీరు. నేనేం ఆపను. నేను కూడా, మనమధ్య ఉన్న బంధాన్ని పటిష్టం చేస్తున్న దానిని తెంపేస్తాను. ఈ బంధం, ఈ బయలాజికల్ లింక్ రేపటి నా భవిష్యత్తుకి ప్రతిబంధకం కాకూడదు. అబార్షన్ చేయించుకుంటాను'' ఆవేశంగా అంది మైత్రేయి.

ఒక్కసారిగా నిశ్శబ్దం. రంగారావు గబుక్కున మైత్రేయిని చూశాడు.

''మీ చూపుకి అర్ధం తెలుస్తోంది. కానీ తప్పదు. పిల్లలు పుడ్తే ఎన్నో బాధ్యతలు. మామూలుగా పర్వాలేదు కానీ, ఓ సింగిల్ పేరెంటుగా నేనేం ఆ బాధ్యతలు తీసుకోదల్చుకోలేదు. ముందు నా కాళ్ళమీద నేను నిలబడగలగాలి. ఓ ఉద్యోగానికి కావలసిన అర్హతలు సంపాదించుకోవాలి. ఎక్కడో అక్కడ ఉద్యోగం చూసుకోవాలి. అన్నింటికి అడ్డుగా ఉండే ఈ పిల్లాడు నాకక్కర్లేదు...''

వర్ధనమ్మ ఏడుస్తూ కోడల్ని ఓసారి చూసి వెళ్ళిపోయింది. వాళ్ళిద్దర్నీ అలా వదిలేస్తే మంచిదనిపించింది ఆమెకు.

''భేష్ రంగా... చాలా గొప్పవాడివయ్యావ్‌రా! పెళ్ళాన్ని, పిల్లాడిని వొదిలేసి వెళ్దామనుకుంటున్నావ్...

మంచి మొగుడివే...''

రంగారావుకి కోపం వచ్చింది. అన్నగారినేం అనలేక పోయాడు.

''మైత్రేయి...'' కోపంగా అన్నాడు.

నిదానంగా చూసింది భర్తని.

''ఏం... పేరు పెట్టి పిలచారు! పేరుపెట్టి పిలిస్తే, పెళ్ళాంమీద ప్రేమ ఎక్కువవుతుందని మీ గురువుగారు అన్నారని పెళ్ళయిన మొదట్లో నాతో అన్నారు. అలాంటిది ఇప్పుడెందుకు పిలిచారు? ప్రేమతోనా! ఇప్పుడు మీ గురువుగారు గుర్తుకురాలేదా! గురువుగారిమీద గౌరవం తగ్గిందా! అలా తగ్గినప్పుడు, గురువుగారిని మరిచిపోయినప్పుడు నా ఒంటిమీద చేయి వేశారా! అన్నీ త్యాగం చెయ్యి, సంసారం మాయ, సంసార మోహంలో పడద్దన్నప్పుడు నన్నెందుకు చేసు కున్నారు...''

''అమ్మ బలవంతంమీద...''

''పాపం. ఆవిడ మీమీద ప్రేమతో అలా చేశారు. పెళ్ళయితే ఈ గురువుగారి పిచ్చి వదుల్తుందని అను కున్నారేమో. కానీ పిచ్చి వదల్లేదు.

గాలి పీలుస్తూ, అన్నంతింటూ, ఈ భూమ్మీద బతు కుతున్న మనుషుల్నే మీరు త్యాగం చేస్తున్నారు.

అలాంటిది, నేను, ఈ భూమ్మీదకి ఇంకారాని, పూర్తిగా ఆకారం కూడా దాల్చని ఓ గుడ్డుని త్యాగం చేస్తే ఏం...?

పిల్లలు పుట్టడానికి స్త్రీపురుషులిద్దరూ కావాలి. పెంచడానికి కూడా కావాలి కదా!''

వర్ధనమ్మ మళ్ళా వచ్చింది. కొడుకు ఎదురుగా నుంచుంది.

''మైత్రేయిని గట్టిగా పిలిచావ్... ఎందుకు! మైత్రేయి అబార్షన్ అని అనగానే పిలిచావ్. అంటే మైత్రేయి చేయ బోయే పని మంచిదికాదనే కదా... అంటే నీకు మంచేదో, చెడేదో తెలుస్తోందన్నమాట...''

మైత్రేయి అత్తగారిని పక్కకిలాగి, రంగారావు ముందు నుంచుంది.

''మంచి చెడుల గురించి, పాపపుణ్యాల గురించి మాట్లాడే మీకు, ఆ గురువగారు మీ ధర్మాల గురించి ఏమీ చెప్పరా...! పిల్లలు పుట్టడంలో మీ భాగం ఎంతుందో చెప్పరా...!

ధర్మాధర్మాల గురించి, ఏది ధర్మమో, ఏది అధ ర్మమో, ఏది పాపమో, ఏది పుణ్యమో, గురువగారిని అడిగి ముందు ఆ జ్ఞానం పొందండి అప్పుడు నన్ను గట్టిగా పిలవండి...''

ఆరోజే మైత్రేయి పెట్టె సర్దుకుని పుట్టింటికి వెళ్ళిపోయింది. ఆమెకు అడ్డుకోడానికి ఏ హక్కులు ఉపయోగించాలో వర్ధనమ్మకి, రంగారావుకి, అతని అన్నకి తెలీక ఊరుకున్నారు.

మైత్రేయి జరిగిందంతా, తల్లికి తండ్రికి చెప్పింది.

''సంసారం మాయ అని అంటాడా! అలా అని వదిలేస్తాడా! మరి పెళ్ళి, తను, నువ్వు, ఈ కడుపులోని బిడ్డ... ఇవి మాయ కాదు కదా... సత్యం కదా...''

''చెప్తే వినే స్థితిలో లేరమ్మా... అబార్షన్ ఒక్కటే మార్గం...'' తల్లి బాధపడింది.

''వొద్దమ్మా... అలా చేయకు...''

''ఆ తండ్రికి, నామీద, ఈ బిడ్డమీద ఏ మాత్రం బాధ్యత లేనప్పుడు, నాకెందుకీ బాధ్యత! ఆ తండ్రిమీద నాకేమాత్రం ఆశలేనపుడు, ఈ కొడుకుమీద ఆశ దేనికి?''

తల్లికి, తండ్రికీ ఆమాట నిజమే అనిపించింది. ముందు ముందు ఈ సంతానం అడ్డుకావచ్చు. అబార్షన్ అయింది.

నిన్నటివరకూ, మైత్రేయి జీవితంలో ఓ అధ్యా యంలా అనిపించిన ఆ చిన్న ప్రాణి ముక్కలయింది. పేజీ చిరిగిపోయింది. మరో పేజి తిరిగింది. పక్క పేజీ లోకి వెళ్ళిపోయింది జీవితం.

ఈ విషయం విన్న వర్ధనమ్మ చాలా బాధపడింది. రంగారావుకీ విషయం తెలిసి నిశ్శబ్దంగా ఉండి పోయాడు. పైగా ఆ రాత్రే రైలెక్కి ఆశ్రమానికి వెళ్ళి పోయాడు.

ఆశ్రమంలోకి వచ్చాక స్వర్గంలోకి వచ్చినట్లుగా అని పించింది. పనిలేదు. బాధ్యతల్లేవు. భజనలు చేయడం, గురువుగారి ప్రవచనాలు వినడం, పురాణ కాలక్షేపం, తినడం, నిద్ర... ఇదే హాయిగా ఉందనుకున్నాడు.

కొన్నిరోజులయ్యేసరికి విసుగ్గా అనిపించడం మొద లయింది. ఏదో లోపం...

అందుకే గురువుగారిని అడిగాడు ''ఏదైనా పని చేస్తానని...''

''పనికేం... బోల్డుంది. చెయ్యాలని మనసుకలగాలే కానీ,చేయడానికి చాలా ఉన్నాయి. గోశాలుంది, అక్కడ చాలా పనులున్నాయి. పశువులకి మేత వేయడం, వాటిని కడగడం, పాలుపితకడం, పేడతీయడం కింద నేలంతా శుభ్రం చేయడం...''

రంగారావుకి నచ్చలేదు. ఈ పేడా, ఆవులూ, పాలు

పితకడాలు. గురువుగారు అర్థం చేసుకున్నారు.

''ఓ స్కూలుంది. ఆస్పత్రి ఉంది. భోజనాలగది ఉంది. వంటశాల ఉంది. కూరగాయల తోట ఉంది... ఏదైనా చేయచ్చు...''

మరో ఇల్లులా అనిపించింది. వీటికి దూరంగా ఉండాలనేకదా ఇక్కడికొచ్చింది. ఆయన వీటినే కదా త్యాగం చేయమన్నది సంసారాన్ని త్యాగం చేయమన్నారు. అందులో సుఖం ఉందన్నారు. మరి ఈ పనులన్నీ సంసారంలోవే కదా... మరి ఈపనులు చేస్తూంటే ఇక్కడ దొరికే సుఖం ఏవిటో...!

ఇవే పనులు ఇంట్లో వాళ్ళు చేసేవారు. వాళ్ళంతా తన పనులు కూడా చేసేవారు. ఈ పనులు చేస్తే ఆనందం కలుగుతుందని గురువుగారిలా వాళ్ళేం తనతో అనలేదు. వాళ్ళు కూడా ఏదో ఆనందాన్ని వెతుక్కోడం కోసం చేయలేదు.

అది సామాజిక ధర్మం, సహజంగా వచ్చిన పనులు చేయాలి, ప్రకృతి ధర్మం అని చేశారు. మరి ఇక్కడ! తన వాళ్ళెవరూ లేరు. తన వాళ్ళుకాని వాళ్ళకోసం, ఈ పనులుచేయడం ఏవిటో! ఈ పనులు చేస్తే పేరు ఎవరికి వొస్తుంది? గురువు గారికి. తనకి రాదు కదా!

రాను రాను ఆ బోధలు, ధ్యానాలు, యాగాలు అన్నీ కూడా పైన పటారంలా కనిపిస్తోంది.

ఇక్కడి నుంచి వెళ్ళిపోతే...

''ఏం రంగా, ఇల్లు, మనుషులు గుర్తుకొచ్చారా? కొత్తగా వచ్చావు కదా, అలాగే ఉంటుంది...'' అంటూ అతను వచ్చాడు.

''నాకేం గుర్తురావడంలేదు...'' బింకంగా అన్నాడు రంగారావు.

''నమ్మను... పెళ్ళాం పిల్లలు గుర్తొస్తున్నారేమో...''

''నాకేం పెళ్ళికాలేదు. పెళ్ళాం పిల్లలు లేరు...''

ఆశ్చర్యంగా చూశాడు అతను రంగాని.

''ఉన్నారని విన్నాను. అందరూ ఉన్నా, ఏం ఆశించి వచ్చావిక్కడికి?''

''తెలీదు...''

''నేను నమ్మను...''

''రెండేళ్ళ నుంచి, ఈ ఆశ్రమంతో సంబంధం ఉంది. గురువుగారి ఉపన్యాసాలు విన్నాను. బావుందనిపించింది... ఇక్కడే ఉండిపోవాలనిపించింది. అన్నీ త్యాగం చేసి వచ్చెయ్యి అన్నారు. నెలకోసారి వచ్చి వెళ్ళేవాడిని మొదట్లో... తర్వాత పూర్తిగా వచ్చేశాను...''

అతను నవ్వాడు... నవ్వుతూంటే అతనిలో ఓ ఆకర్షణ కనిపిచింది. నలభైఏళ్ళుంటాయేమో. ఉంగరాలు తిరిగిన పొడుగాటి జుట్టు, నీట్‌గా ఉండే మొహం.

''అయితే మీకు త్యాగానికర్థం తెలీదు. త్యాగం చేయాలంటే, కోరికల్ని, అహంకారాన్ని, కామాన్ని, మోహాన్ని అన్నమాట, దీనికోసంఆశ్రమానికే రావక్కర్లేదు. ఇంట్లోనే ఉండి కూడా ప్రయత్నించవచ్చు.

నువ్వు వచ్చి మూడు నాలుగు నెల్లవుతోంది కదా, నువ్వు సుఖంగా ఉన్నావని నీకనిపించిందా! నీకోరికల్ని అదుపులో ఉంచుకున్నావా? అసలు ఆ ఆలోచనలే రాకుండా చేసుకోగలిగావా!''

రంగారావు దగ్గర సమాధానం లేదు.

''ఇప్పటికైనా మించిపోయింది లేదు. ఇంటికెళ్ళిపో...''

''ఇప్పుడా! ఇప్పుడెలా! ఇన్నిరోజులయ్యాక ఎలా కుదుర్తుంది?''

''ఏం! ఎందుకు కుదరదు? త్యాగం పేరుతో నీ వాళ్ళందర్నీ వదిలేశావ్, మరి వాళ్ళంతా నీకోసం బాధపడ్తున్నారేమో, ఆలోచించు...''

''నేను లేకుండా, వాళ్ళంతా బతకడానికి అలవాటు పడి ఉండచ్చు...''

''నీ భార్యకూడానా!'' కనుబొమల్ని చిత్రంగా ఎగరేసి అన్నాడు అతను.

రంగారావేం మాట్లాడలేదు.

''మన సమాజంలో భర్తపోతే, ఆస్త్రీకి వివాహం అవుతుంది. కానీ, భర్త వదిలేసిన భార్యలని పెళ్ళిచేసుకోడానికి జంకుతారు. ఎన్నో అనుకుంటారు... ఆలోచించుకో...కానీ ఆలస్యం చెయ్యకు...''

ఆ రాత్రి రంగారావుకి నిద్రపట్టలేదు.

కళ్ళముందు, పెద్ద కాటుక కళ్ళున్న మైత్రేయి అమాయక మొహం, ఆమె మాటలూ గుర్తొచ్చాయి. తనకి ఎంతో అనుకూలంగా ఉండేది. సమాజం ఆమోదించిన బంధంవల్ల, ఆమెతో అన్ని సుఖాలు సహజంగా వచ్చాయి.

ఆమె శరీరాన్ని కోరుకున్నప్పుడు, ఆమె ఏనాడూ ప్రతిఘటించలేదు. నమ్రత, వినయం, ఒద్దికగా ఉండేది. ఓ మొగాడు కోరుకునే విధంగా ఉండేది. అయినా తృణీకరించాడు. ఆమె నేనా! ఆమెనే కాదు, ఆమెలోని తన అంశాన్ని కూడా. తప్పు జరిగిందా అన్న భావం కలిగింది.

ఆ తర్వాత అతను కొన్ని రోజులు కనిపించలేదు.

ఓ సాయంత్రం అటూ ఇటూ తిరుగుతున్న రంగా

రావుకి అతను కనిపించాడు.

అతని దగ్గరికెళ్ళి పలకరింపుగా నవ్వాడు.

''ఓ వారం రోజుల్నించి కనపళ్ళేదు...''

''అవును... ఆస్పత్రిలో ఉండిపోవాల్సి వచ్చింది...''

''ఓ... మీరు ఆస్పత్రికి కూడా వెళ్ళి సేవలు చేస్తూంటారన్నమాట...''

''సేవలే... కానీ... ఓ డాక్టరుగా... రోజూ వెళ్ళి పేషెంట్లని చూస్తూంటాను''

ఆశ్చర్యపోయాడు. అదే అన్నాడు. ''మీరు డాక్టరా... నాకు తెలీదే...''

''ఇదే నీలోని బలహీనత. నీ చుట్టూ ఉన్నవాళ్ళని గమనించవు. నీ ప్రపంచంలోనే ఉండిపోతావు. మనం మనుషులం... ఎవరెలా పోతే మనకేం అని అనుకునే మహాత్ములం కాదు...''

రంగారావు అతని మాటలకి పెద్ద ప్రాముఖ్యం యివ్వలేదు.

''ఒక్కమాటడుగుతాను... చెప్తారా... నన్ను వెళ్ళిపొమ్మన్న మీరు ఎందుకున్నారు? మీరు ఎవరితో బంధాలుంచుకోలేదా!''

''బంధాలు పెంచుకునే రక్త సంబంధీకులు లేరు. నాకెవరూ లేరు. అందరూ నాక్కావాలి. అందరి మధ్యా ఉండాలి. అందుకు ఇదొక్కటే సరి అయినది... నా అనే వాళ్ళకోసం తపించిపోయాను. ఓ యింటికోసం ఆశపడ్డాను. వాటివిలువ నాకు తెలిసినంత బాగా నీకు తెలీడంలేదు. అందుకే ఇల్లొదిలేసి వచ్చావంటే బాధపడి వెళ్ళిపొమ్మంటున్నాను...''

''నన్ను వెళ్ళిపొమ్మనకండి. సన్యాసం స్వీకరించే ఉద్దేశంతో వచ్చాను''

నవ్వాడు. ''జీవితంలోని ఎగుడు దిగుడు దారుల్లో నడవలేక, బాధ్యతలనుంచి తప్పించుకోవడం కోసం ఈ పారిపోవడం చేస్తూంటారు. నువ్వనుకుంటున్నావేమో సన్యాసం అంటే త్యాగం చేయడం అని, కానీ, సన్యాసులకి కూడా మామూలు మనుషుల్లాగే అన్నీ కావాలి. అన్నీ ఉన్నాయి. నవ్వుతారు, మాట్లాడతారు, తింటారు, తాగుతారు, పడుకుంటారు... ఓ విధంగా పలాయనవాదులే...''

''సన్యాసులుగా అవుతారంటారు. పోనీ నాది పలాయన వాదమే అనుకోండి. మరి మీరు... నాలా కాదు కదా. మీకు కుటుంబం మనుషులు అన్నీకావాలి కదా... మీకేం లేదు. ఎవరూ లేరేం...''

''నిజమే. నాకు కావల్సింది, కోరుకున్నది దేవుడివ్వలేదు. నేను ఓ యింటిని ఏర్పర్చుకోలేను...'' అంటూ ఆగాడు.

''ఏం... భయమా!''

''హు... భయం ఎందుకు? ఓ లక్ష్యం ఉన్న వాళ్ళకి భయం ఉండదు. నా చదువుని ఈ ఆస్పత్రికి, ఇక్కడి పేషెంట్లకి ఇక్కడి వాళ్ళకోసం ధారపోస్తాను. జీవన మార్గాన్ని సుగమం చేసుకున్నాను. నాకిప్పుడు చాలా మంది ఉన్నారు. నాకోసం బాధపడేవాళ్ళు ఉన్నారు''

''అదే... అదే నేనడుగుతున్నాను. నన్ను పొమ్మంటున్న మీరు మీరెందుకుంటున్నారు. ఏమో... మీలాగా నాక్కూడా ఇక్కడ ఆత్మీయులు ఏర్పడుతారేమో... నాకోసం బాధపడేవాళ్ళు కూడా అందులో ఉంటారేమో... ఏమో, ఎవరికి తెలుసు!''

''అవన్నీ వదిలెయ్యి... నీకో వింత చూపిస్తాను. రాత్రి వస్తాను''

''నామీద యింత శ్రద్ధ చూపుతున్నారు. మీ పేరేవిటో తెలుసుకోవచ్చా!''

''అడగద్దు. పేరులో ఏవుంది? పేరు లేకుండానే, ఎంతో మంది అనామకులు పుడుతున్నారు, పోతున్నారు... రాత్రి కలుద్దాం...''

ఆ రాత్రి పన్నెండు దాటాక అతను వచ్చి రంగారావుని లేపాడు. ఇద్దరూ కలిసీ, ఆశ్రమంలో చాలా దూరం నడిచారు. గుబురు చెట్లు, సన్నటి దారి కింద రాతి నేల, చీకటిగా ఉంది. నడకని బట్టి మెట్లు లేకపోయినా స్లోపుగా ఉన్న దార్లోంచి వెళ్తున్నట్లుగా అనిపించింది రంగారావుకి.

డాక్టరుకి ఆ దారి బాగా పరిచయం ఉన్నట్లుగా ఉంది. ఓచోట ఆగాడు. తలుపుతోశాడు. తెరచుకుంది. ''అక్కడ ఆ చెట్లమధ్య తలుపుందని నేను గ్రహించలేదు. మీరెలా గ్రహించారు?''

''ఇదిగో ఈ పూలతీగె. పచ్చటి పూలు నిండా ఉన్న ఈ పూల తీగె...''

లోపలికెళ్ళారు. డిఫ్యూస్డ్ కాంతితో చాలా ఖరీదుగా ఉన్నాయి లోపలి గోడలూ లైట్లు ఫ్యాన్‌లు... ఓరగా తెరచి ఉన్న తలుపుల సందులోంచి కనిపిస్తున్న దృశ్యాల్ని చూడలేకపోయాడు... ఇంకా ముందుకెళ్ళాక తలుపు తట్టి డాక్టరు ఓ గదిలోకి వెళ్ళాడు. అక్కడ గురువు గారు పీలికల్లాంటి బట్టల్లో ఉన్న స్త్రీలతో... రంగారావుకి జరగరానిది ఏదో జరుగుతున్నట్లుగా అనిపిస్తోంది. నమ్మబుద్ధికావడంలేదు.

''నన్నెందుకు పిలిచారు?'' డాక్టరు గొంతు.

''ఈ అమ్మాయి మొహాన్ని సరిగ్గా చూడు. రేపు ఆస్పత్రికొస్తుంది...'' వచ్చిన పని అయిపోయినట్లుంది. డాక్టరు బయటికొచ్చాడు. మళ్ళా ఇద్దరూ కలిసీ, అదే దారిలో వచ్చి, ఓ చెట్టుకింద ఉన్న సిమెంటు బెంచిమీద కూచున్నారు.

''ఇదీ గురువుగారి అసలు స్వరూపం. రాత్రి ఆడ వాళ్ళు కావాలి. ఆయనకి కాపోతే మరొకళ్ళకి. వాళ్ళకి కడుపొస్తే, అబార్షన్ చేయడానికి, ఆ మనిషి మొహం గుర్తుపట్టడంకోసం నన్ను పిలిపిస్తుంటారు...

ఇప్పుడు ఆలోచించు. గురువుగారు ఏం త్యాగం చేశారో అని. ఇప్పుడు మనం వెళ్ళింది ఆశ్రమం బయటి నుంచి. దీనికి లోపల్నించి దారి ఉంది... అందులోంచే ఆయన వెళ్తారు. అలాంటి దారి ఉందని ఎవరికీ తెలీదు...''

రంగారావుకి అంతా అయోమయంగా ఉంది.

దేనికోసం ఇల్లు వదిలాడు? ఇక్కడేం జరుగుతోంది? ఏం చేయాలి? డాక్టరువైపు తిరిగాడు.

''ఇక్కడ ఇంతమంది ఉన్నారు కదా! నన్నే తీసుకెళ్ళి నాకే చూపించారెందుకు?''

''దూరపు కొండలగురించి, ఏం తెలుసుకోకుండా వచ్చావనిపించింది. అందుకే చెప్పాలనిపించింది. ఇంటికెళ్ళిపో...''

''మీరు నాతో వస్తారా...''

''నేను వచ్చేస్తే ఎలా! నీలా దారితప్పిన వాళ్ళ గురించి పట్టించుకునేదెవరూ? ఈ బురదలో దిగాను. ఈ బురదతోనే కడిగేసుకుంటాను. పైగా నేనో లక్ష్యంతో ఉన్నాను... వెళ్ళిపో...''

''మిమ్మల్ని ఓ ప్రశ్న అడుగుతాను. బురద అని తెలిసీ ఎందుకున్నారు? అంతగా సేవ చేయాలనుకుంటే, ఎన్నో అనాథాశ్రమాలూ అవీ ఉన్నాయి. కదా...''

''నా ఐడెంటిటీని ఇక్కడే కాపాడుకోగలను. నేను నపుంసకుడిని. నన్ను నేను బాధపెట్టుకోడం ఇష్టంలేక, ఇక్కడుంటున్నాను. నాకు ఇక్కడ ఎంతో మంది

## వ్యసనాలు

నేను వెళ్తున్నాను
నడివీధిలో!
కళ్ళకు
కనిపించింది
ఓ పాలపిట్ట
లాటి సుకుమారి!
నన్ను చూడకుంటేనే
నఖశిఖ
పర్యంతం నే
గమనిస్తూనే వున్నా!
బెంగాలీ చీరెలో
మెరిసిపోతుంది
లోలోన!
నాకనిపించింది
నాకే కావాలని!
నా మనసు
చెప్తుంది నాకే
సొంతమని!
అంతే
అడుగు
ముందుకేసా!
స్వాతంత్ర్య
సమరయోధుడిలా
జనాలు
తిరుగుతున్నారు!
నాకే
కావాలనిపించింది!
జనాలతో
నాకేం పని?
చేయి పట్టాను!
బిత్తరపోయింది
ఏమది
ఎవరు నువ్వు
అంది!
నాకు నువ్వు
కావాలన్నాను!
చెంప చెళ్ళు
మనిపించింది!

నాలో కోపం రగిలింది!
నడిరోడ్డు
అయితేనేం
నాలో
తిమింగిలం
లేచాక
ఆగుతానా?
బలవంతాన
లాక్కున్నాను!
అందరూ
చూస్తునే వున్నారు!
అయితేనేం
లెక్కచేయదు
నా మనసు!
ముద్దుపెట్టుకోబోయాను!
ముఖంపై
పిడిగుద్దులేసింది!
కమ్మాయి
కళ్ళు బైర్లు!
పదిమందీ పోగయ్యారు!
రహదారి కదా!
అందరూ
గుమిగూడారు!
తెలుసుకున్నారు!
విషయం!
వడ్డించారు
తలో పిడికిలి!
కుప్ప
కూలాను!
లేవలేక!
అబలా
నీవే కావాలి
మిగతా వారికి
ఆదర్శం!
అపుడే
అడుగంటుతాయి
ఇలాంటి వ్యవహార
వ్యసనాలు!
రోమియోలకో
గుణపాఠం
నేర్పాలిగా!

ఆచార్య నరేంద్ర

ఉన్నారు. నాకోసం, నా గురించి అడగరు... అదొక్కటే ప్లస్ పాయింట్...''

గురువు గారు రంగారావుని అడిగారు.

''రంగా!... ఏం ఆలోచించావ్? ఏం పని చేయాలనుకున్నావ్...''

''నేను వెళ్ళిపోవాలనుకున్నాను...''

''తిరిగి ఆ నరకంలోకా...''

''మీరు ఏదైనా అనుకోండి. పెళ్ళయింది. నా జీవితంలో ఆమె తప్ప మరో స్త్రీ లేదు. కానీ, ఆమెను గూర్చి ఆలోచించకూడదని అనుకున్నాను. కానీ, కొన్ని శారీరక ధర్మాలని అదుపులో పెట్టుకోడం కష్టంగా ఉంది. నా వశం కావడం లేదు...''

''అది నీ అజ్ఞానం, యోగాతో... ధ్యానంతో అన్నీ సాధ్యమే''

''మీరింత ధ్యానం చేస్తారు. ఇన్ని బోధిస్తారు. మరి మీ శరీరాన్ని, కోరికల్ని అదుపులో ఉంచుకున్నారా!''

''రంగా! ఇలాంటి అశ్లీల ప్రశ్నలు వేయకూడదు''

''క్షమించండి... నన్నొదిలేయండి... నన్నాపకండి. నన్ను వెళ్ళిపోనీయండి. ఈ ప్రపంచంలో ఎలా పుట్టామో అలాగే ఉండాలి. ప్రకృతికి విరుద్ధంగా వెళ్ళచ్చనుకుని ఇక్కడ చేరాను. కానీ కష్టం అని తెలుసుకున్నాను. ఇంట్లో ఉండి, ఇంట్లో వాళ్ళకి పనులు చేయడం, బాధ్యతలు, ధర్మాలు నిర్వర్తించడమే పెద్ద తప్పు. ఇది నాకు ఈ ఆశ్రమం నేర్పించింది''

''సరే... నేనాపను. ఇన్ని రోజులయింది కదా, నీ భార్య నీకోసం వేచి వుంటుందా!''

''ఇంట్లో భార్య ఒక్కతే ఉండదు కదా, ముసలితల్లి కూడా ఉంది. కానీ, నేనేం చేస్తానో ఎలా చెప్పగలను? కానీ... ఇక్కడికి రాను...''

ఆశ్రమం బయటికి వచ్చాక ప్రపంచం, ఇంతవరకూ చూడని కోణంలో కనపడింది... బస్టాండు వైపుగా నడిచాడు రంగారావు. ■